ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 7 మే 2024





గోదారి గట్టున మోదీ గర్జన

ఆదికవి నన్నయ్య నడయాడిన ఈ గడ్డ నుంచి ఎన్డీయే ఈ ఎన్నికల్లో కొత్త అధ్యాయం సృష్టించబోతోంది. గెలిచేది కూటమి ప్రభుత్వమే. రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థులతోపాటు అసెంబ్లీ అభ్యర్థులందరినీ గెలిపించాలి.

- ప్రధాని నరేంద్ర మోదీ

గురి కుదిరింది



కేంద్రంలోను, రాష్ట్రంలోను మనమే గెలుస్తున్నాం

సభకు హాజరైన వారికి అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, లోకేశ్, పవన్, పురందేశ్వరి, శ్రీనివాసవర్మ తదితరులు



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎన్నికల సభలో ప్రధాని మోదీ

- వేమగిరిలో దద్దరిల్లిన కూటమి ప్రజాగళం
- ఆదికవి నన్నయను స్మరిస్తూ గోదావరి ఒడ్డు నుంచే చరిత్ర సృష్టిస్తున్నట్టు ప్రకటన
- ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజా తినాలని ప్రధానిని కోరిన లోకేశ్
- పవన్ వేదికపైకి రాగానే ఒక్కసారిగా మార్మోగిపోయిన సభ.. వేలల్లో హాజరు

(కాకినాడ/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి గడ్డపై నుంచి ప్రధాని మోదీ గర్జించారు. ఎన్నికల శంఖారావం పూరించారు. రాబోయే ఎన్నికల్లో రాజమహేంద్రవరం నుంచే కొత్త చరిత్ర సృష్టిస్తామని ప్రతినబూనారు. ఆదికవి నన్నయ సరికొత్త అధ్యాయం సృష్టించినచోటే ఎన్డీయే కూడా విజయఢంకా మోగిస్తుందని ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభ దద్దరిల్లింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పోటెత్తిన జనప్రవాహంతో మార్మోగింది. అటు ప్రధాని మోదీ, ఇటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితర దిగ్గజాల హాజరుతో సభ కొత్త కళ సంతరించుకుంది. వేలాది మంది సభకు కాషాయ టోపీలు ధరించి మోదీ మోదీ అంటూ నినాదాలు చేయడంతో సభ హోరెత్తింది. పవన్ వచ్చిన వెంటనే సభలో ఉన్న వేలాది జనం కేరింతలు గోదావరి ఉప్పెనలా హోరెత్తింది. సరిగ్గా మధ్యాహ్నం మూడున్నరకు ప్రధాని మోదీ సభా వేదికపైకి రాగానే జనం నినాదాలు చేశారు. అటు తన ప్రసంగాన్ని మోదీ తెలుగులో ఆరంభించి అందరినీ అబ్బురపరిచారు. సభకు వచ్చిన రాజమహేంద్రవరం ప్రజలకు నమస్కారములు అంటూనే గోదావరి తల్లికి తల వంచి నమస్కరిస్తున్నా అనడంతో ఒక్కసారిగా ప్రాంగణం మార్మోగింది. ఆదికవి నన్నయ్య నడయాడిన ఈ గడ్డ నుంచి ఎన్డీయే ఈ ఎన్నికల్లో కొత్త అధ్యాయం సృష్టించబోతున్నామని చెప్పి గెలిచేది కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థులతో పాటు అసెంబ్లీ అభ్యర్థులందరినీ గెలిపించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే రాజమహేంద్రవరం విమానాశ్రయం, కాకినాడ పోర్టు, జాతీయ రహదారి మరింత అద్భుతంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. చెన్నై-కాకినాడ పారిశ్రామిక కారిడార్ పనులు ఊపందుకుంటాయని చెప్పి ఇక్కడ ప్రజల మనసు చూరగొన్నారు. సభా వేదిక పైన కూటమి అభ్యర్థులను పలకరించారు. లోకేశ్ తన సరదా ప్రసంగంతో మోదీని ఆకట్టుకున్నారు. ఆత్రేయపురం పూతరేకులు, తాపేశ్వరం కాజా మోదీ తినాలని అనగానే నవ్వులు పూశాయి. అటు లోకేశ్ మాట్లాడే సమయంలో ఆయన ప్రసంగానికి మోదీ చప్పట్లు కొట్టారు. అలాగే వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని లోకేశ్ మోదీకి అందించారు. మంగళగిరి నుంచి తెచ్చిన చేనేత కండువాను మోదీకి అందించారు. కాగా సభా వేదికపైకి మోదీ రాగానే పవన్ మోదీకి శాలువా కప్పారు. అనంతరం కాళ్లకు నమస్కరిస్తుండగా ప్రధాని వారించి అడ్డుకున్నారు. మోదీకి వెంకటేశ్వరస్వామి జ్ఞాపిక అందించారు. ఇలా ప్రజాగళం సభ రాజమహేంద్రవరంలో కూటమి పార్టీలకు మంచి కిక్ ఇచ్చింది. స్వయంగా మోదీ వచ్చి సభలో పాల్గొనడంతో ఆయా అభ్యర్థుల్లో విజయంపై మరింత ధీమా పెంచేసింది.

మోదీకి సత్కారం

రాజమహేంద్రవరం వేమగిరి జాతీయ రహదారి పక్కనే ఖాళీ స్థలంలో సోమవారం సాయంత్రం జరిగిన కూటమి ఎన్నికల బహిరంగ సభకు విచ్చేసిన ప్రధానికి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 3:30 గంటలకు సభా వేదికపైకి మోదీ చేరుకున్నారు. అటుపై సాయంత్రం 4:30 గంటలకు తన ప్రసంగాన్ని ముగించారు. తొలుత ప్రధానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని అందించారు.



ఎటూ చూసినా జనమే..

వేమగిరిలో ఏర్పాటు చేసిన కూటమి ప్రజాగళం సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. జనం తండోపతండాలుగా రావడంతో జాతీయ రహదారి కిటకిటలాడింది. మహిళలు సైతం అధిక సంఖ్యలో రావడం విశేషం. సభ పూర్తయ్యే వరకూ ఎండను సైతం లెక్కచేయకుండా ఓపికగా ఉన్నారు. మోదీ, పవన్, లోకేశ్ ప్రసంగాలకు పెద్ద ఎత్తున స్పందిస్తూ చప్పట్లతో, నినాదాలతో హోరెత్తించారు. ప్రజాగళం సభకు ప్రధాని మోదీ హాజరుకావడంతో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అడిషనల్ డీజీ స్వీయ పర్యవేక్షణలో ఇద్దరు ఐజీలు తూర్పు గోదావరి ఎస్పీ జగదీశ్ సహా ఆరుగురు ఎస్పీలు.. మూడు వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించాయి. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన గ్యాలరీల్లోకి చేరుకోవడానికి ముందు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. 35 చెకింగ్ పాయింట్లను ఏర్పాటుచేసి ప్రతి ఒక్కరినీ పరిశీలించి అనుమతించారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతర గస్తీ కాశాయి. రోడ్డు పక్కన పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాను తొలగించిన పోలీసులు.. వారి వాహనాలను పార్క్ చేసుకున్నారు. పోలీసు వాహనాలు వేదికకు సమీపంలోని జాతీయ రహదారిపై నిలపవద్దని, పార్కింగ్ ప్రదేశాలకు వెళ్లాలని వేదిక పైనుంచి ఓ పోలీసు అధికారిణి మైక్‌లో చెప్పినా ఫలితం లేకపోయింది. భద్రతా చర్యల్లో భాగంగా వాటర్ బాటిల్, పెన్, సిగరెట్, అగ్గి పెట్టె, గుట్కా, పార్టీ జెండాలను అనుమతించ లేదు. మోదీ రాకకు అరగంట ముందు నుంచీ.. ఆయన వెళ్లిన తర్వాత వరకూ వేదిక నుంచి హెలీప్యాడ్ వరకూ హైవేపై ఎవరినీ అనుమతించలేదు. మోదీ వెళ్లిన తర్వాత జనం తిరుగు ప్రయాణం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి.

• మోదీ స్ఫూర్తి.. బాబు యుక్తి.. పవన్ శక్తి

ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్‌కల్యాణ్ శక్తి కలయిక అపూర్వం. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల ఘన విజయం తథ్యం. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది తెలుగుదేశం విధానమైతే, బాధితుల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించే పార్టీ జనసేన. కూటమి కలయిక రాష్ట్రంలో సుపరిపాలనకు కూటమి దోహదపడుతుంది. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కూటమి అధికారంలోకి రావాలి. గడచిన ఐదేళ్లలో మనం అన్ని రకాలుగా ఇబ్బందులు పడ్డాం. ఏ వర్గానికీ న్యాయం జరగలేదు. రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా నిలబడడం నా అదృష్టం. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని ప్రజలు ఆశీర్వదించాలి.

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

• అధికారం మనదే : శ్రీనివాసవర్మ

కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్‌డీఏ అధికారంలోకి రాబోతోంది. రాష్ట్రంలో వ్యవస్థలను జగన్ నాశనం చేశాడు. ప్రపంచంలోనే ఐదో ఆర్థికశక్తిగా భారత్‌ను తీర్చిదిద్దిన ఘనత మోదీకి దక్కుతుంది.

- బీజేపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌వర్మ

సర్వేలన్నీ కూటమి వైపే

- ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామ



భీమవరం, మే 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరంటూ ఎంపీ, ఉండి కూటమి టీడీపీ అభ్యర్థి రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. భీమవరంలో సోమవారం నిర్వహించిన రచ్చబండలో ఆయన మాట్లాడుతూ 'జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి అటకెక్కింది. పోలవరం పడకేసింది. జగన్ నిర్వాకం వల్లే పోలవరం పూర్తి కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే దీనిని పూర్తి చేస్తామంటూ అమిత్‌షా ప్రకటించారు. అది నిజమైతీరుతుంది. ఉత్తరాంధ్రతోపాటు, రాయలసీమకు పోలవరం ప్రాజెక్టల వల్ల ప్రయోజనం చేకూరుతుంది. జగన్ రాజధాని లేని రాష్ట్రం చేశాడు. మూడు రాజధానులన్నాడు. ఎక్కడా ఏమి చేయలేదు. రాష్ట్రంలో అన్ని సర్వేలు కూటమి అధికారంలోకి వస్తాయని స్పష్టం చేస్తున్నాయి. జగన్ ఏడాదికి రూ.8.50 కోట్లు ఇచ్చే టైమ్స్ నౌ మాత్రం వైసీపీ వస్తుందని చెబుతోంది. ప్రజలంతా కూటమిని నెగ్గించాలని ఎదురు చూస్తున్నారు. నేను చేసిన రెండు సర్వేల్లోనూ అదే తేలింది. జగన్‌కు అభివృద్ధి ఆలోచనే లేదు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. తెలుగును కాపాడుకుంటామని అమిత్ షా చెబితే తన సొంత పత్రికలో వక్రభాష్యం చెప్పారు. పిల్లలకు ఆంగ్ల మాధ్యమం లేకుండా చేస్తున్నారంటూ అమిత్ షాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. తెలుగు భాషపై పునాదులు ఉండాలి. ఆ తర్వాత ఆంగ్ల మాధ్యమం దృష్టి సారించాలి. అంతేతప్ప ప్రైమరీ స్థాయి నుంచి ఐబీ సిలబస్ అంటూ జగన్ హడావిడి చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నాలుగు వేల పాఠశాలల్లోనే ఆ సిలబస్ ఉంది. దానిని ఇక్కడ ఉపాధ్యాయులు అందుకునే పరిస్థితి ఉండదు. కన్నాలు వేయడానికే అన్ని వ్యవస్థలను జగన్ భ్రష్టు పట్టించారని రఘురామ మండిపడ్డారు.

ఐసెట్ ప్రశాంతం




భీమవరం ఎడ్యుకేషన్/తాడేపల్లిగూడెం రూరల్, మే 6 : ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ భీమవరం, తాడేపల్లిగూడెం కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా జరిగింది. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 150 మందికి 142 మంది విద్యార్థులు హాజరయ్యారు. పెదతాడేపల్లి శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 250 మందికి 241 మంది, మధ్యాహ్నం 250 మంది 231 మంది పరీక్ష హాజరైనట్లు కో ఆర్డినేటర్ నటరాజ్ తెలిపారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 130 మందికి 123 మంది, మధ్యాహ్నం 117 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ మహ్మద్ ఇస్మాయిల్, పరీక్ష కేంద్రం కో ఆర్డినేటర్ మహమ్మద్ పి.రాంబాబు తెలిపారు.

రసవత్తరం.. నరసాపురం

- కూటమి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ
- నరసాపురం పార్లమెంట్ స్థానంలో మూడోసారి బీజేపీ
- వైసీపీ నుంచి బరిలో గూడూరి ఉమాబాల
- అసెంబ్లీ అభ్యర్థుల బలాబలాలపైనే బేరీజు
- సామాజిక సమీకరణాలు ఎవరికి కలిసొచ్చేను?

-7లో



ఓటుకు.. 3 వేలు!

ఉద్యోగులకు పార్టీల తాయిలాలు

- ఆచంటలో వెండి కుంకుమ భరిణెలు
- భీమవరంలో అత్యధిక నగదు పంపిణీ
- ఉత్సాహంగా ఓట్లు వేసిన ఉద్యోగులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు సోమవారం నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభమైంది. నరసాపురం పార్లమెంట్‌తో పాటు దాని పరిధిలోని మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15 వేల మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. వీరందరికీ సోమ, మంగళవారాల్లో ఓటింగ్ నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్యాలెట్ ఓటింగ్ వచ్చిన ఉద్యోగులకు తాయిళాలు ఇవ్వడంలో అభ్యర్థులు పోటీపడ్డారు. ఒకరికి మించి మరొకరు సొమ్ములు ఇచ్చారు. జిల్లాలో ప్రతి ఉద్యోగికి కనిష్ఠంగా రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు ముట్టజెప్పారు. భీమవరంలో అత్యధికంగా రూ.3 వేల వరకు అందజేశారు. ఆచంటలో అధికార పార్టీ నుంచి వెండి కుంకుమ భరిణి పంపిణీ చేశారు. అధికార పార్టీ తాయిలాలు ఇస్తుండడంతో తాము వెనుకపడిపోతామంటూ కొన్నిచోట్ల కూటమి నుంచి ఉద్యోగులకు సొమ్ములందించారు. మొత్తంపైన అభ్యర్థులు పోటీ పడ్డారు. ఉద్యోగుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. బ్యాలెట్ ఓటింగ్‌లో అది స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వపరంగా చిరుద్యోగి నుంచి అధికారి వరకు వేలాది రూపాయలు నష్టపోయారు. ఐదేళ్లుగా సరెండర్ లీవ్‌లకు ప్రభుత్వం సొమ్ములు విడుదల చేయలేదు. ఏటా సరెండర్ లీవులు పెట్టుకుంటే కనిష్ఠంగా రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు అందేవి. పండుగలకో, పిల్లల ఫీజుల కోసమో ఆ సొమ్మును వినియోగించేవారు. మరోవైపు సీపీఎస్ రద్దు చేస్తామని అమలు చేయలేదు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదు. ఇలా అన్ని విధాలా నష్టపోయామన్న భావన ఉద్యోగ వర్గాల్లో ఉంది. ఎన్నికల వేళ రూ.2 వేలు ఇచ్చి ఓటేయాలని అధికార పార్టీ అభ్యర్థులు ఉద్యోగులను ప్రాధేయపడ్డారు. కాని, ఉద్యోగులు మాత్రం ఓట్ల రూపంలో సరైన నిర్ణయం తీసుకున్నామని చెబుతున్నారు. ప్రభుత్వంపై ఉద్యోగుల్లో ఇంతటి వ్యతిరేకత ఎప్పుడూ చూడలేదంటూ ఓటేసి వచ్చిన ఉపాధ్యాయులు ప్రకటించడం విశేషం. తొలిరోజు చాలాచోట్ల ఉద్యోగులకు బ్యాలెట్ పత్రాలు రాకపోవడంతో ఓట్లు వేయలేదు. ఆర్టీసీ ఉద్యోగులు ఓట్లు వేయలేకపోయారు. ఎన్నికల విధులకు పంపుతున్నట్టు వారికి ఆర్డర్ ఇవ్వకపోవడంతో వారంతా తొలిరోజు ఓటుకు దూరమయ్యారు. మంగళవారం ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

తొలి ఓటు పడింది



ఆచంటలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఆర్వో స్వామినాయుడు

7,540

- జిల్లాలో తొలి రోజు ఓటు వేసిన ఉద్యోగులు
- పటిష్ఠ బందోబస్తు.. నేడు కూడా ఓటింగ్

భీమవరం టౌన్/ఆచంట/నరసాపురం/ తాడేపల్లిగూడెం రూరల్/తణుకు, మే 6 : పశ్చిమ గోదావరి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రారంభమైంది. ఎన్నికల విధులు నిర్వహించే 13,854 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి పొందారు. తొలిరోజు సోమవారం 7,540 మంది ఓటు హక్కు వినియోగించారు. ఎండను సైతం లెక్క చేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు. ఓటు వెయ్యటానికి వచ్చిన ఉద్యోగులను పరిశీలించిన తర్వాతే అనుమతి ఇచ్చారు. తొలిరోజు ఓటు వేయని వారు కూడా మంగళవారం సెంటర్లకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. ఈ రెండు రోజుల్లో ఓటు హక్కు వినియోగించుకోని వారు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సంబంధిత నియోజకవర్గ ఆర్వో వద్ద ఓటు హక్కు వేయాలన్నారు.

- ఆచంట నియోజకవర్గానికి సంబంధించి ఆచంట ఎంవీవీఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ జరిగింది 1,483 మంది ఓటర్లకు గాను 855 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు పర్యవేక్షించారు. ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పితాని సత్యనారాయణ , చెరుకువాడ శ్రీరంగనాధరాజు కొంత సేపు పర్యవేక్షించి అనంతరం వెళ్లిపోయారు.
- పాలకొల్లుకు సంబంధించి పట్టణంలోని ఎంఎంకేఎన్ఎం హైస్కూల్‌లో పోలింగ్ జరిగింది. మొత్తం రెండు వేల 103 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకోగా తొలిరోజు 1,357 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాఠశాలల్లో ఐదు బూత్‌లను ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించినట్లు ఎన్నికల అధికారి బీఎస్ నారాయణరెడ్డి తెలిపారు.
- నరసాపురం నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని వైఎన్ కాలేజీ ఆడిటోరియం పోలింగ్ జరిగింది. మొత్తం 1,583 మంది దరఖాస్తు చేసుకోగా 888 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో అనేక నిబంధనలు మారడంతో ఒక్కోఓటు వేసేందుకు చాలా సమయం పట్టింది. ఎన్నికల జనరల్ పరిశీలకులు దీపిక, ఆర్వో అంబరీష్ పోలింగ్ తీరును పరిశీలించారు. తమకే ఓటు వేయాలని అభ్యర్థులు ఉద్యోగులను అభ్యర్థించారు.
- భీమవరం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించి ఓటింగ్ కేంద్రాలను పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశారు. భీమవరం నియోజకవర్గానికి 2 వేల 781 మంది దరఖాస్తు చేసుకోగా 1,295 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండిలో 1,625 మందికి గాను 1,034 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- తణుకుకు సంబంధించి పట్టణంలోని జాస్తి మహాలక్ష్మి బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ జరిగింది. మొత్తం 2,156 మంది గాను 1,138 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో బి.వి.రమణ తెలిపారు.
- తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి కోడె వెంకట్రావు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ జరిగింది. మొత్తం 2,011 మంది ఓటర్లకు గాను 973 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఆర్వో కె.చెన్నయ్య తెలిపారు. వైసీపీ నాయకులు ఓటు వేసేందుకు వచ్చిన ఉద్యోగులకు వారు వద్దంటున్నా రూ.2,500 కవర్‌లో పెట్టి తాయిళాలు అందించారు. పోలింగ్ కేంద్రానికి సమీపంలో వైసీపీ ప్రచార వాహనాలను నిలపడంతో కూటమి నాయకులు ప్రశ్నించారు. దీంతో వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఆ వాహనాలను బయటకు పంపించారు.

ఏమిటి.. ఇంతేనా?

ఓటుకు వెయ్యితో సరి..! ఓటర్ల పెదవి విరుపు

ఖర్చు తగ్గించుకుంటున్న వైసీపీ అభ్యర్థులు

పాలకొల్లు, మే 6 : వార్ వన్‌సైడే అని తేలిపోయిందా ? అవుననే అంటున్నారు పరిశీలకులు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి ఓటుకు మూడు నుంచి ఐదు వేల వరకు ఇస్తారని తొలుత ప్రచారం జరిగింది. కాని, పాలకొల్లులో ఓటర్లకు వెయ్యి చొప్పున సోమవారం పంపిణీకి శ్రీకారం చుట్టారు. వీటిని అందుకుంటున్న వారు 'ఏమిటి.. ఇంతేనా?' అంటూ పెదవి విరుస్తున్నారు. మరోవైపు ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ అభ్యర్థి పెద్ద మొత్తంలో పంపిణీ చేస్తారని ప్రచారం జరగ్గా, ఇప్పుడు వెయ్యి మాత్రమే ఇచ్చి సరిపెట్టడం ఎన్నికల ఫలితంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఆ పార్టీ ప్రముఖులు హెచ్చరిస్తున్నారు. సొమ్ముల పంపిణీకి స్థానికేతరులను వినియోగించడంపై స్థానిక నేతలు గుర్రుగా ఉన్నట్టు సమాచారం. ఇంటిలిజెన్స్ రిపోర్టులు, ఓటర్లలో వ్యతిరేకత నేపథ్యంలో వైసీపీ అభ్యర్థులు ఖర్చు తగ్గించుకునే పనిలో పడినట్టు చెబుతున్నారు. వీటన్నింటిని బేరీజు వేస్తున్న ప్రజలు, రాజకీయ విశ్లేషకులు పాలకొల్లులో వార్ వన్‌సైడ్ అయ్యిందని, కూటమి అభ్యర్థి హ్యాట్రిక్ విజయానికి చేరువలో వున్నారని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



భీమవరంలో ఓటర్ల భారీ క్యూలైన్



తాడేపల్లిగూడెంలో జనసేన నాయకులకు సర్ది చెబుతున్న పోలీసులు



ఆచంటలో పోస్టల్ బ్యాలెట్ ఓటేసేందుకు క్యూలో ఉద్యోగులు



భీమవరంలో ఉద్యోగులను తనిఖీ చేస్తున్న పోలీసులు



భీమవరంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఆచంట అసెంబ్లీ బరిలో రెండు ప్రధాన పార్టీలు కాలుదువ్వుతున్నాయి. తెలుగుదేశం కూటమి, వైసీపీ నుంచి ఇద్దరు మాజీ మంత్రులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఇద్దరు నేతలు తమదైన ముద్ర వేసుకున్న వారే. మంత్రులుగా జిల్లా రాజకీయాల్లో కూడా చక్రం తిప్పారు. మరోసారి ఎన్నికల బరిలో నిలిచారు. ఆచంటలో 2019 నుంచి ఆ ఇద్దరే ప్రత్యర్థులు. మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తెలుగుదేశం, జనసేన బీజేపీ కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణ, వైసీపీ నుంచి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పోటీ పడుతున్నారు. ఇద్దరు నేతలు వ్యూహ ప్రతివ్యూహాల్లో ఆరితేరిపోయారు.

- ఆచంట

ఆచంట సైకిల్ జోరు

• విజయం దిశగా దూసుకెళుతున్న సైకిల్ • స్పీడ్ తగ్గిన ఫ్యాన్ • హస్తవాసి అంతంతమాత్రమే



పితాని సత్యనారాయణ
టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి

బలాలు
బీసీ వర్గాలకు మొదటి నుంచి అండగా ఉన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, మంత్రిగా పలు అభివృద్ధి పనులు చేయడం, అందరిని కలుపుకోయే తత్వం, జనసేన, బీజేపీ మద్దతు.

బలహీనత
• మనసులో మాట సూటిగా చెప్పేయడం
• కార్యకర్తలు తప్పుచేస్తే వెంటనే అడిగేయడం, కడిగేయడం.





ఆచంట నుంచి పితాని మూడోసారి..

ఆచంట నియోజకవర్గం నుంచి పితాని సత్యనారాయణ మూడోసారి పోటీ పడుతున్నారు. 2009లో ఆచంట నియోజకవర్గం నుంచి పితాని సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 2014 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం, టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించారు. ఆచంట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు. అదే 2019 ఎన్నికల్లో పితానిపై వైసీపీ పక్షాన పోటీ చేసిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు విజయం సాధించారు. ఇప్పుడు మళ్లీ కూటమి తరఫున పితాని బరిలో ఉన్నారు. రెండు నెలలపాటు పాదయాత్ర నిర్వహించి ప్రతి గడపకు వెళ్లారు. కూటమిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలోని నాలుగు మండల గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓటర్లను కలుసుకున్నారు. కూటమి అభివృద్ధిని, అజెండాలను ప్రజల్లోకి తీసుకువెళ్లారు. మరోవైపు సామాజిక వర్గాల వారీగా మద్దతు కూడగట్టుకోవడంలో ఈ సారి పితాని వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. పగలు పాదయాత్ర, రాత్రి వేళల్లో గ్రామంలో ముఖ్యనేతలతో సమీక్షలు నిర్వహించి పార్టీ బలం, బలహీనతలను అంచనా వేశారు. చక్కదిద్దే ప్రయత్నాలు చేశారు. ఇవన్నీ ఇప్పుడు పితానికి కలసి వస్తున్నాయి. గత ఎన్నికల్లో జనసేన విడిగా పోటీ చేసింది. ఇప్పుడు కూటమికి అండగా నిలిచింది. టీడీపీ ఓటు బ్యాంకుతోపాటు, జనసేన ఓటుబ్యాంకు ఇప్పుడు పితానికి కలిసి వస్తోంది. నియోజకవర్గం నలుమూలలా ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. మరోవైపు పితాని గెలుపొందితే మంత్రి పదవి ఖాయమన్న విశ్వాసం ఆచంట ప్రజల్లో బలంగా ఉంది. ఇదికూడా పితానిని గెలుపు దిశగా తీసుకువెళుతుందని పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి.

ఆచంట బరిలో ఉన్న అభ్యర్థులు

1. అలూరి చిన్నారావు	బీఎస్‌పీ	ఏనుగు
2. శ్రీరంగనాథరాజు	వైసీపీ	ఫ్యాన్
3. నెక్కంటి సత్యనారాయణ	కాంగ్రెస్	హస్తం
4. పితాని సత్యనారాయణ	టీడీపీ	సైకిల్
5. కాకి శ్యాం కుమార్	జేబీబీపీ	కోటు
6. వెలగల శ్రీనివాసరెడ్డి	జేబీఎన్‌పీ	బ్యాటరీ టార్చి
7. పూర్ణచంద్రశేఖర్	స్వతంత్ర	బ్యాట్స్‌మెన్
8 సికిలే రత్నంరాజు	స్వతంత్ర	ఏడు రేకల కలం పాళి
9అల్లాడి సూర్యభాస్కరరావు	జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ	సిలిండర్

మొత్తం ఓటర్లు :	**1,88,017**
గౌడ, శెట్టిబలిజ:	56 వేలు (సుమారు)
కాపు:	27 వేలు
ఎస్సీలు:	40 వేలు
రెడ్డి:	15 వేలు
క్షత్రియులు:	11 వేలు
కమ్మ:	9 వేలు
మిగిలిన కులాలు	30 వేలు



చెరుకువాడ ఎదురీత

గడచిన ఎన్నికల్లో ప్రతి ఇంటికి వెళ్లారు. అందరినీ ఆప్యాయంగా పలుకరించారు. అందరి కష్టాలు విన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున శ్రీరంగనాథరాజు విజయం సాధించి మంత్రి పదవి దక్కించుకున్నారు. ఈ సారి ప్రభుత్వ వ్యతిరేకత రంగనాథరాజును వెంటాడుతోంది. పార్టీ శ్రేణులు దూరమయ్యాయి. కొందరినే రంగనాథరాజు నమ్ముకున్నారు. నియోజకవర్గంలో వారే చక్రం తిప్పారు. దాంతో పార్టీ విధేయులంతా ఇప్పుడు విముఖతతో ఉన్నారు. మరోవైపు ఐదేళ్లపాటు వలంటీర్లపై ప్రభుత్వం ఆధారపడడంతో కేడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. దానికితోడు ఇసుక దందాలో ఆచంట మండలంలో ఇద్దరు సర్పంచ్‌లు అంతా తామై వ్యవహరించారు. వారిద్దరితో ఆచంట మండలంలో పార్టీకి వ్యతిరేకత ఎదురవుతోంది. పెనమంట్రలో ఇద్దరు మహిళల నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. దానివల్ల అక్కడ కూడా పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి ఉంది. పార్టీ శ్రేణులకంటే రాజీనామా చేసిన వలంటీర్లపైనే ఇప్పుడు ఆచంటలో వైసీపీ ఆధారపడుతోంది. గత ఎన్నికల్లో గెలుపుకోసం కష్టపడిన ముఖ్య నాయకులు ఇప్పుడు దూరంగా ఉన్నారు. ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ కొన్ని గ్రామాల్లో మరో వర్గం దూరంగా ఉంటోంది. ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు కలసి వస్తాయని రంగరాజు ఆశిస్తున్నారు. గత ఎన్నికల ముందు రంగరాజు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఆచరణ సాధ్యం కాలేదు. మరోవైపు నియోజకవర్గంలో అభివృద్ధి లేదన్న భావన ప్రజల్లో ఏర్పడింది. ఇవన్నీ ఇప్పుడు వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.



చెరుకువాడ శ్రీరంగనాథరాజు
వైసీపీ అభ్యర్థి

బలాలు
ప్రత్యర్థివర్గాల్లో సైతం దూసుకెళ్లే గుణం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కలసి వస్తాయని అంచనా. మహిళలందరూ వైసీపీ వైపే ఉన్నారని ధీమా.

బలహీనత
• కార్యకర్తలు చనువుగా రంగరాజును కలుసుకోలేకపోవడం.
• కొందరికే ప్రాధాన్యం. ఇతరులకు దూరం పెట్టడం.

ప్రచారానికి గిట్టుబాటు కూలీ



సార్వత్రిక ఎన్నికలు వ్యవసాయ, దినసరి కూలీలకు భలే గిరాకీ. ప్రతిరోజూ గ్రామాల్లో రాజకీయ సమావేశాలు, మీటింగ్‌లు, ప్రచారాలు ఉండడంతో వ్యవసాయ కూలీలకు గిట్టుబాటు కూలి దొరుకుదోంది. ప్రచారాలకు మీటింగ్‌కు వెళితే రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి మొత్తంతో పాటు బిర్యానీ, మందు బాటిల్స్ ఇస్తారు. మహిళలకు బిర్యానీతో పాటు మరో రూ.200 అదనంగా ఇస్తున్నారు. అధికార పార్టీ నాయకులు అధికంగా ఓటర్లకు మద్యం, డబ్బు ఎర చూపుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా తక్కువగా ఉండడంతో కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేయిస్తున్నారు. ఉపాధి పనులకు వెళితే రూ.250 మించి ఇవ్వడం లేదు. రాజకీయ సమావేశాలు, ప్రచారాలకు వెళితే సాయంత్రానికి డబ్బులు అందుతాయి. ఒక్కొక్క ఇంటి నుంచి ఇద్దరు నుంచి ముగ్గురు వరకు రాజకీయ ప్రచారాలకు వెళుతున్నారు. పొలం పనుల కంటే ఇదే బాగుందని కూలీలు సంతోషిస్తున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిర్యానీ, రాత్రి మందు బాటిల్, రూ.500 నుంచి రూ.వెయ్యి వస్తోంది. మరో వారంరోజులు పొలం పనులకు వెళ్లేది లేదని కూలీలు చెబుతున్నారు. - **ఏలూరు రూరల్**

అందరూ బంధువులే..



ఆ గ్రామంలో అందరూ బంధువులే. 250 ఓట్ల వరకు ఉంటాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా గ్రామానికి కాపు నాయకులు ప్రత్యేకంగా ప్రచారానికి వెళతారు. చింతలపూడి మండలం వెంకటాపురం పంచాయతీలోని లక్ష్మీనరసింహపురం ప్రత్యేకత ఇది. సుమారు 126 ఇళ్లలో బంధువులే కావడంతో ఏ ఫంక్షన్ జరిగినా అందరికి పిలుపులు ఉంటాయి. ఓట్లు కూడా ఒకేలా ఉంటాయంటే పొరపాటే. ఏ పార్టీకి చెందిన బంధువులు ఆ అభిమానానికే ప్రచారం చేస్తుంటారు. వివిధ పార్టీల నాయకులు గ్రామంలో ఒకరి బంధువుల ద్వారా మరొకరితో ప్రచారం చేయిద్దామనుకున్నా ఎవరి అభిమానం వారిది అంటూ చొరవ తీసుకోవడం లేదు. బంధుత్వాలు శుభకార్యాలు, సొంత విషయాలకే పరిమితం అంటున్నారు. - **చింతలపూడి**

అక్కా... బాగున్నావా

రాజకీయ పలకరింపులు




బాగున్నావా అక్కా.. ఎలా ఉన్నావ్ చెల్లీ.. ఏంటి పెద్దమ్మా.. తాతా ఏంసేత్తున్నావ్.. తల్లీ అబ్బాయెక్కడ.. ఇలా గ్రామాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రేమ ఒలకబోస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు తెలిసినా తెలియకపోయినా అందరినీ వరుసలతో పలకరిస్తున్నారు. ఇవి రాజకీయ పలకరింపులని వాళ్లకీ తెలుసు.. వీళ్లకీ తెలుసు. అభ్యర్థులు ఇలా పలకరిస్తూ వెళుతుంటే వెంటే ఉన్న కార్యకర్తలు ఆయా పార్టీల మేనిఫెస్టో, నమూనా బ్యాలెట్ పేపర్లు ఇచ్చి ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇంతకు ముందు అభ్యర్థులే స్వయంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఓ నమస్కార బాణం వేసేసి తన ఎన్నికల గుర్తును కూడ చెప్పి మరీ వెళ్లే వారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. అభ్యర్థులు వాహనాలపై దణ్ణం పెట్టుకుంటూ వెళ్తుంటే ఎనకాల వచ్చే వారు గుర్తులు చెబుతూ అనుసరిస్తున్నారు. - **ముదినేపల్లి**

గ్రామాల్లో ఎన్నికల పందేలు..

ఉంగుటూరు నియోజకవర్గ అసెంబ్లీ స్థానంలో విజయంపై గ్రామాల్లో జోరుగా పందేలు కాస్తున్నారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థి రంగంలో దిగడంతో మాదే గెలుపు అంటూ అధికార పక్షం నాయకులు లక్షకు, రెండు లక్షలు ఇస్తామంటూ ముందుకు వచ్చారు. ప్రస్తుతం గాలి మారింది. అధికారపార్టీ నేతలు చప్పబడ్డారు. కూటమి నేతలు కోసు పందేలకు తహతహలాడుతున్నారు. కూటమి అభ్యర్థి తరపున లక్షకు లక్షన్నర చెందుతూ ఇస్తామంటూ పందేలకు పరుగులు పెడుతున్నారు. అధికారపార్టీ నేతలు మాత్రం వెనకడుగులు వేస్తున్నారు. - **భీమడోలు**

బ్రాహ్మణ పథకాలు రద్దు

వైసీపీ పాలనలో తప్పని తిప్పలు



ఏలూరు రూరల్, మే 6: టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేస్తూ వచ్చింది. వివిధ సామాజిక వర్గాల వేలాది మంది లబ్ధిదారులు నష్టపోయారు. బ్రాహ్మణులకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసింది. వైసీపీ ప్రభుత్వం వాటిని ఒక్కొక్కటి రద్దు, మరికొన్ని అమలులో కాలయాపన చేసింది. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఒక కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు వృద్ధులున్నా అందరికి పించన్ వచ్చేది. వైసీపీ ప్రభుత్వం ఒక కుటుంబంలో కేవలం ఒకరికే పించన్ అంటూ కోత పెట్టింది. తర్వాత సామాజిక పింఛన్ పతకానికి మార్పు చేయడంతో అనేకమంది బ్రాహ్మణ వృద్ధులకు రద్దయింది. వయస్సుతో నిమిత్తం లేకుండా భర్తను కోల్పోయిన, ఒంటరి బ్రాహ్మణ మహిళలకు సైతం టీడీపీ ప్రభుత్వం నెలవారీ పింఛన్ కార్పొరేషన్ ద్వారా అందించేది. దీన్ని సైతం వైసీపీ ప్రభుత్వం నిలుపుదల చేసింది. బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు కార్పొరేషన్ ద్వారా గతంలో ఆర్థిక సాయం అందేది. దీన్ని కూడా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. బ్రాహ్మణులు చనిపోయినప్పుడు గరుడ పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేసే విధంగా టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దరఖాస్తు చేసుకున్న 10 నుంచి 15రోజుల్లో రూ.10వేలు మృతుల వారసులకు అందేవి. ప్రస్తుతం ఈ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారు అనేక మంది నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. కారు, నాలుగుచక్రాల వాహనాలు కొనుగోలు చేసి అద్దెకు తిప్పడం ద్వారా స్వయం ఉపాధి పొందేవిధంగా టీడీపీ హయాంలో కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ యువతకు రుణాలు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఇది అమలు చేయడం లేదు.

బ్రాహ్మణులను అణగదొక్కారు



సీఎం జగన్ ఐదేళ్ల నుంచి రాష్ట్రంలోని బ్రాహ్మణులను అణగదొక్కారు. ఎన్నికల ముందు జగన్‌కు బ్రాహ్మణులు గుర్తుకు వస్తారు. పూజారులు, అర్చకులపై దాడులు జరిగినప్పుడు స్పందించలేదు. గత ఎన్నికల్లో బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల్లో జగన్ ఒక్కటి నెరవేర్చలేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 11 పథకాలు అమలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్ పూర్తిగా ఎత్తేసే పరిస్థితి వచ్చింది. కేవలం నవరత్నాల పేరుచెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు. చంద్రబాబు సీఎం అయితే బ్రాహ్మణ సంక్షేమం సాధ్యం.

సత్యవాడ దుర్గాప్రసాద్, అధ్యక్షుడు, రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య

నూజివీడు హోరాహోరీ



నూజివీడు క్యాపిటల్ సిటీ ఆఫ్ మ్యాంగోస్. గతంలో 14 పరగణాలకు రాజధాని కేంద్రం. నూజివీడు కోటలో ఇప్పటివరకు మూడు సార్లు మినహా మిగిలిన కాలమంతా 'వెలమ'ల ఆధీనంలో ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి ఆయనకు గట్టిపోటీ ఎదురైంది. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరి నూజివీడు సీటు సాధించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో పార్థసారథి మంత్రిగా కూడా పనిచేశారు. ఇక ప్రతాప్ వరుసగా మూడోసారి గెలిచి, వైసీపీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి దక్కుతుందనే ఆశాభావంతో, గతం కన్నా భిన్నంగా, పట్టుదలతో ఎన్నికల వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఇద్దరు నిన్నటిదాకా మిత్రులే. అసెంబ్లీలో బెంచ్‌మేట్‌లు కూడా. ఇప్పుడు చెరోపార్టీలో ఉండి ప్రత్యర్థులుగా మారారు. ఈ నియోజకవర్గంలో గతంలో గెలిచిన డాక్టర్ ఎమ్మార్‌అప్పారావు, పాలడుగు వెంకట్రావు మంత్రులుగా పని చేశారు. -నూజివీడు

ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కూటమికి వరం.. వైసీపీ వెనకబాటు

నియోజకవర్గంలో ప్రధానపార్టీలైన వైసీపీ, తెలుగుదేశం పార్టీలు అంతర్గత తలనొప్పులతో సతమతమవుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత, ఉద్యోగులు, టీచర్లలో అసంతృప్తి, వైసీపీ స్థానిక ప్రజాప్రతినిధుల విభేదాల నడుమ విజయంపై వైసీపీ నేతల్లో ఆందోళన నెలకొంది. స్థానిక తెలుగుదేశంలో గ్రూపు విభేదాలు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వర్గంను కలుపుకోవడంలో జరిగిన జాప్యం వంటి అంశాలతో తెలుగుదేశం సతమతమవుతోంది. ఎన్నికలను చంద్రబాబు, జగన్ మధ్యే అనే అంశాన్ని ప్రజలు చూస్తున్నారు. అదే తమను ఈసారి ఎన్నికల్లో గట్టు ఎక్కిస్తుందనే ఆశాభావంతో స్థానిక టీడీపీ ఉంది. నూజివీడు బరిలో పోటీ మాత్రం నువ్వానేనా అన్నట్లు సాగుతోంది. ఎవరు గెలిచినా ఇక్కడ తక్కువ మెజార్టీతోనే విజయం అందుకుంటానని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

పోటీ ఉత్కంఠభరితం

నూజివీడు బరిలో ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉత్కంఠభరితంగా సాగుతోంది. తెలుగుదేశం రెబల్ అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుతో నామినేషన్ ఉపసంహరించి తిరిగి ఆయనను పార్టీలో చేర్చుకోవడం, అభ్యర్థి పార్థసారథి ఆర్థిక బలవంతుడు కావడంతో తెలుగు తమ్ముళ్లలో జోష్ పెరిగింది. నిన్నటి వరకు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఎన్నికల బరిలో ఉండడంతో, తెలుగుదేశం ఓట్లు చీలి తమకు సునాయాస విజయం లభిస్తుందని వైసీపీ భావించింది. ముద్దరబోయిన తిరిగి సొంత గూటికి చేరుకోవడంతో ఆ పార్టీనేతలు తమ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇరు పార్టీలు హోరా హోరీ తలపడుతున్నాయి.

అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థులు

1. కొలుసు పార్థసారథి	టీడీపీ	సైకిల్
2. సి.వెంకటేష్	బీఎస్పీ	ఏనుగు
3. మరీదు కృష్ణ	కాంగ్రెస్	హస్తం
4.మేకా వెంకటప్రతాప్ అప్పారావు	వైసీపీ	ఫ్యాన్
5. పాము రవీంద్ర	ఆర్‌పీఐ	కరెంటుస్తంభం
6. ఎస్.ఎస్.పి చంద్రరావు	స్వతంత్ర	పెన్‌స్టాండ్
7. ఆముదాల ఇస్సాకు	స్వతంత్ర	టార్చ్‌లైట్
8. కొలుసు కమలలక్ష్మి	స్వతంత్ర	హ్యాంగర్
9. బొట్ల శివసత్యనారాయణ	స్వతంత్ర	ల్యాప్‌టాప్
10. మందలపు శ్రీనివాసరావు	స్వతంత్ర	ఓడ



మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


బలాలు
• స్థానికుడు, సౌమ్యుడు, వివాదరహితుడు.
• కృష్ణా జలాల తాగునీరు పథకం, మోడల్ హౌసింగ్ కాలనీ ఆయన ఎమ్మార్ అప్పారావు కాలనీ.

బలహీనత
• వైసీపీ తరఫున రెండుసార్లు గెలిచినా అభివృద్ధి లేకపోవడం.
• పదేళ్లలో కేడర్‌కు వ్యక్తిగత పనులు జరగకపోవడం.
• కుమారుడి వ్యవహారశైలితో ప్రజల్లో ఏర్పడిన విముఖత.

కొలుసు పార్థసారథి

బలాలు
• నూజివీడులో వరుసగా రెండు సార్లు ఓటమితో సానుభూతి.
• విజయం సాధించాలని తెలుగు తమ్ముళ్లలో పట్టుదల.
• తొలిసారి నూజివీడు బరిలోకి దిగడం.

బలహీనత
• స్థానికేతరుడు, గెలిచినా స్థానికంగా ఉండడు. విజయవాడలోనే మకాం ఉంటాడని ప్రచారం.
• పార్టీలో స్థానికంగా గ్రూపుల మధ్య విభేదాలు.





ఎన్నికల్లో చిన్నారుల సందడి..

రాజకీయ నేతలు, కార్యకర్తలు మెడలో పార్టీ కండువాలు, తలకు పార్టీ రంగు క్లాత్ చుట్టి ప్రచారం చేస్తున్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో చిన్నారులు కూడా ఎన్నికల్లో సందడి చేస్తున్నారు. పార్టీ జెండాలు, కండువాలు వేసుకుని సరదాగా ఇంట్లోనే తిరిగేస్తున్నారు. తణుకు పట్టణంలోని ఆరో వార్డులో కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల ప్రచారంలో చిన్నారి పసుపు కండువా తలకు చుట్టుకొని, మెడలో లోకేశ్, ఆరిమిల్లి ఫొటోల కండువా వేసుకుని ఆకట్టుకుంది. అత్తిలి మండలం వరిఘేడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆరిమిల్లి కృష్ణతులసికి చిన్నారి అభిమాని సైకిల్ బొమ్మ బహూకరించాడు. సైకిల్‌పై వచ్చిన ప్రభుత్వం మంచి భవిష్యత్ ఇస్తుందని చిన్నారిని కృష్ణతులసి ఆశీర్వదించారు. - **తణుకు**





ఆ సామాజిక వర్గానిదే హవా !

జిల్లాలో అతితక్కువ ఓటర్లు కలిగి నియోజకవర్గం నరసాపురం. రెండు మండలాలు, ఒక పట్టణం కలిగి ఉన్న ఈ నియోజకవర్గంలో 1.68 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.వీరిలో అత్యధిక ఓటర్లు కాపు కులస్థులే. సుమారు 55 వేల మందిపైగా ఉన్నారు. ఈ కారణంగా 1978 నుంచి ప్రతి ఎన్నికలోనూ ప్రధాన పార్టీల్లో ఏదో ఒక్కటి ఈ సామాజికి వర్గానికి చెందిన నాయకులకే టిక్కెట్లు ఇస్తూ వస్తున్నాయి. ప్రత్యర్థిగా మరో సామాజికవర్గం పోటీ చేయడం గత 50 ఏళ్లుగా కొనసాగుతుంది. అయితే తొలిసారి కాపు సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులెవరూ ప్రధాన పార్టీల అభ్యర్థులుగా లేకపోవడం గమనార్హం. 1978లో జనతా పార్టీ తరుపున కాపు సామాజిక వర్గానికి చెందిన పోలిశెట్టి వాసుదేవరావు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పరకాల శేషావతారం నిలిచారు. ఆ తరువాత 1981 ఉప ఎన్నికల్లో వాసుదేవ రావు జనతా నుంచి , కాంగ్రెస్ అభ్యర్థిగా పరకాల కాళికాంబ నిలిచారు. టీడీపీ ఆవిర్భావం తరువాత ఈ స్థానం ప్రతి ఎన్నికల్లోనూ కాపులకే కేటాయిస్తూ వచ్చింది. 1983, 85ల్లో హరిరామజోగయ్య, 1989, 94లో కొత్తపల్లి సుబ్బారాయుడు, 1996 ఉప ఎన్నికల్లో కొత్తపల్లి జానకీరామ్, 1999 నుంచి 2004 వరకు కొత్తపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2009లో ఆయన ప్రజారాజ్యం నుంచి పోటీ చేస్తే కాంగ్రెస్ అభ్యర్థిగా ముదునూరి ప్రసాదరాజు పోటీలో నిలిచారు. తిరిగి 2014లో టీడీపీ అభ్యర్థిగా బండారు మాధవనాయుడు, ప్రత్యర్థిగా వైసీపీ నుంచి కొత్తపల్లి నిలిచారు. 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి బండారు,వైసీపీ నుంచి ముదునూరి,జనసేన నుంచి నాయకర్‌లు నిలబడ్డారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, భారత్ చైతన్య యువజన పార్టీల నుంచి కాపు సామాజిక వర్గానికి చెందిన కానూరి బుజ్జీ, ఆకుల వెంకటస్వామిలు ఉన్నారు.

- నరసాపురం

పార్టీ శిబిరాలు..వెలిశాయ్..



భీమవరం మండల గ్రామంలో వెలిసిన శిబిరం

గ్రామాల్లో పార్టీ శిబిరాలు వెలిశాయ్.. ఎన్నికల హడావుడి మరింత పెరిగింది. గ్రామాల్లో ఒక్కో పార్టీ నుంచి రెండు మూడు శిబిరాలు సెంటర్ల వారీగా ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలకు వ్యూహరచనలు చేసే ప్రయత్నంలో నిమగ్నమవుతున్నారు. శిబిరాలు రాజకీయ చర్చా వేదికలుగా మారాయి. దానికి తోడు శిబిరాలలో ఎక్కువ మందితో హడావుడి చేసి ఆ గ్రామంలో మా పార్టీదే హవా అని నిరూపించుకునే ప్రయత్నాల్లో నాయకులు ఆలోచనలు చేస్తున్నారు. మూడు పార్టీలు, జనసేనలో యువత ఎక్కువగా ఉండడంతో శిబిరాలు సందడిగా కనిపిస్తున్నాయి.

- భీమవరం రూరల్

అబ్బయ్య చౌదరి ఎన్నికల ప్రచారంలో వివాదం





మహిళల ఇంటిపై వేసిన రాయి

ఎమ్మెల్యేని నిలదీస్తున్న మహిళ

ఏలూరు రూరల్, మే 6: దెందులూరు నియోజకవర్గం వైసీపీ ఎన్నికల ప్రచారంలో మరోసారి వివాదం చెలరేగింది. ఇటీవల దెందులూరులో వైసీపీ నాయకుల తీరుతో పలు వివాదాలు కొనసాగుతుండగా తాజాగా సోమవారం రాత్రి ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్లలంక గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అబ్బాయిచౌదరి ఎన్నికల ప్రచారంలో మరో వివాదం చెలరేగింది.గ్రామంలోని హైస్కూల్ వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఉండగా కొందరు వైసీపీ నాయకులు అక్కడి మహిళల ఇళ్లపై రాళ్ల దాడి చేసినట్లు స్థానిక మహిళలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆవేశంతో రగిలిపోయిన మహిళలు ఇంటి బయటకు వచ్చి నేరుగా అబ్బయ్య చౌదరిని నిలదీశారు. తమకు రావలసిన డబ్బును సైతం రాకుండా అడ్డుకున్న దొంగ అంటూ మహిళలు కేకలు వేయడంతో చేసేదేమీ లేక అబ్బయ్య చౌదరి మౌనంగా ముందుకు వెళ్లిపోయారు..

రసవత్తరం..



నరసాపురం

అసెంబ్లీ నియోజకవర్గాలు :

నరసాపురం, భీమవరం, ఆచంట, ఉండి, పాలకొల్లు, తాడేపల్లిగూడెం,తణుకు

మొత్తం ఓటర్లు	: 14,72,923
మహిళలు	:7,51,313
పురుషులు	:7,21,532
ఇతరులు	:78



పొలిటికల్ రివ్యూ

కూటమి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ

నరసాపురం పార్లమెంట్ స్థానంలో మూడోసారి బీజేపీ

వైసీపీ నుంచి బరిలో గూడూరి ఉమాబాల

అసెంబ్లీ అభ్యర్థుల బలాబలాలపైనే బేరీజు

సామాజిక సమీకరణాలు ఎవరికి కలిసొచ్చేను ?

రాష్ట్రంలోనే నరసాపురం లోక్‌సభ స్థానానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఎంపీగా గెలుపొందిన వారు కేంద్రంలో గుర్తింపు పొందారు. కేంద్ర మంత్రి పదవులను అలంకరించారు. నరసాపురం లోక్‌సభ ఎవరి పరమైతే రాష్ట్రం లోనూ అదే పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందనే అభిప్రాయం ఉంది. ఈ సారి ఇక్కడ పోరు రసవత్తరంగా మారింది. తెలుగుదేశం , జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాసవర్మ బరిలో ఉన్నారు. సుదీర్ఘ కాలంగా ఆయన బీజేపీలో కొనసాగుతున్నారు. పొత్తులో బాగంగా నరసాపురం సీటును బీజేపీకి కేటాయించారు. మరో వైపు వైసీపీ తరపున గూడూరి ఉమాబాల బరిలో ఉన్నారు. జిల్లాలోని వైసీపీ నాయకులే ఆమెకు టిక్కెట్ కేటాయింపుపై అవాక్కయ్యారు. మహిళకు టిక్కెట్ కేటాయిస్తారని ఎవరూ ఊహించలేదు. అందులోనూ ఉమాబాలకు టిక్కెట్ వస్తుందని వైసీపీలో ఏ ఒక్కరూ అంచనా వేయలేకపోయారు. ఇప్పుడు నరసాపురం లోక్ సభలో తెలుగుదేశం కూటమి, వైసీపీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పొత్తులో బీజేపీ మూడో సారి

పొత్తులో ఉన్నప్పుడు నరసాపురం లోక్‌సభ ఇదివరకే రెండు పర్యాయాలు బీజేపీకి కేటాయించారు. ఒకసారి కృష్ణంరాజు బీజేపీ తరపున పోటీచేసి నెగ్గారు. తర్వాత గోకరాజు గంగరాజు భారీ అధిక్యతతో విజయం సాధించారు. తెలుగుదేశం-జనసేనతో పొత్తు కుదుర్చుకున్న బీజేపీ ఇప్పుడు మూడోసారి నరసాపురం సీటును దక్కించుకుంది. ఈసారి శ్రీనివాస్ వర్మకూడా భారీ ఆధిక్యతతోనే విజయం సాధిస్తారంటూ ఆ పార్టీ ధీమాతో ఉంది. కూటమి అభ్యర్థులు, నాయకులు సంపూర్ణ సహకార మందిస్తున్నారు. మరోవైపు ప్రతి నియోజకవర్గం లోనూ బీజేపీ శ్రేణులు ప్రత్యేకంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఇంటింటా తిరుగుతున్నారు.

మహిళ సెంటిమెంట్ ?

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ సెంటిమెంట్‌ను ఈ సారి ప్రయోగించింది. గూడూరి ఉమాబాలకు టిక్కెట్ ఇచ్చింది. పార్టీ ఓటు బ్యాంకు ఆమెకు కలసి వస్తుందని ఆ పార్టీ నాయకులు నమ్ముతున్నారు. రెండు ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులదీ భీమవరం కావడం విశేషం. పార్టీ శ్రేణులకు ఉమా బాల పెద్దగా పరిచయం లేదు. జిల్లాలోనూ రాజకీయంగా పెద్దగా పర్యటించిందీ లేదు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వ్యవహరించారు. అదికూడా పెద్దగా పార్టీ శ్రేణ లకు తెలియదు. టిక్కెట్ ప్రకటించగానే పార్టీ శ్రేణులు ఒక్కసారిగా అవా క్కయ్యాయి. ప్రజలకు పరిచయం లేని వ్యక్తిని తెరపైకి తెచ్చారంటూ అంతా విస్మయం చెందారు. అయితే పార్టీ అధిష్ఠానం వద్ద మాత్రం ఉమాబాలకు పట్టు ఉంది. ఆ కోణంలోనే టిక్కెట్ లభించింది. స్థానికంగా పార్టీ బలమే ఉమాబాలకు అండగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థుల బలం పైనే ఆధారం

కూటమి తరపున పోటీ చేస్తున్న శ్రీనివాసవర్మకు వైసీపీ అభ్యర్థి ఉమాబాలకు పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు కీలకం కానున్నారు. వారి విజయ అవకాశాలపైనే లోక్‌సభ స్థానం గెలుపు ఆధార పడి ఉంది. కూటమి తరపున ఉండి, పాలకొల్లు , ఆచంట, తణకులో తెలుగుదేశం అభ్యర్థులు పోటీపడుతున్నారు. భీమరవం, తాడేపల్లిగూడెం, నరసాపురంలో జనసేన అభ్యర్థులు బరిలో నిలిచారు. వైసీపీ తరపున అభ్యర్థులు ఒంటరిగానే పోటీ చేస్తున్నారు. ఎవరికి వారే తమదే గెలుపు అంటూ లెక్కలు వేసుకుంటున్నారు.

వైసీపీలో ఉక్కబోత

వాస్తవానికి నర్సాపురం లోక్‌సభ పరిధిలో ఈసారి వైసీపీ ఎదురీదుతోంది. ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రజా వ్యతిరేకతను చవిచూస్తున్నారు. అభివృద్ధి లేదు. ప్రాజెక్ట్‌లు పెండింగ్‌లో పడిపోయాయి.మౌలిక వసతులు కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. అధికార పార్టీ అభ్యర్థులను అవినీతి వెంటాడుతోంది. ప్రజా వ్యతిరేకతలను చవిచూస్తున్నారు. ఆ ప్రభావం లోకసభ అభ్యర్థిపైనా పడుతోంది. అయితే సంక్షేమ పథకాలు, ఎన్నికల్లో డబ్బుతో నెగ్గుకొచ్చేస్తామంటూ విశ్వాసంతో అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులున్నారు. ఆ కోణంలోనే ఎంపీ అభ్యర్థి నెగ్గుకు వస్తుందన్న అంచనాలు వేసుకుంటున్నారు.

లోక్‌సభపై కూటమి పట్టు

నరసాపురం లోక్ సభ పరిధిలో కూటమి పట్టు బిగిస్తుంది. ఎంఎల్ఏ, ఎంపీ అభ్యర్థుల ప్రకటనలో తొలుత కొంతజాప్యం జరిగింది. అప్పటిలో కూటమి శ్రేణులు కొంత మీమాంసలో పడ్డారు. పొత్తులు కుదిరాక అభ్యర్థుల ప్రకటన తరువాత నర్సాపురం లోక్‌సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాలోనూ కూటమి ఊపందుకుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులందరూ ఒక్కటయ్యారు. నియోజకవర్గ స్థాయిలోనూ కూటమి నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు అధినాయకత్వాలు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి నాయకులు మూకుమ్మడిగా ప్రచరాలు నిర్వహిస్తున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు

1.గూడూరి ఉమాబాల	వైసీపీ
2.భూపతిరాజు శ్రీనివాసవర్మ	బీజేపీ
3.బ్రహ్మానంద రావునాయుడు	కాంగ్రెస్
4.సిర్రా రాజు	బీఎస్పీ
5.ఓలేటి నాగేంద్ర కృష్ణ	జైభీమ్‌రావ్ భారత్
6.పూర్ణిమ గంజి	రిపబ్లికన్ పార్టీ
7.లీలా రామనరేంద్ర మన్నె	పిరమిడ్ పార్టీ
8.అడబాల శివ	స్వతంత్ర
9.అద్దేపల్లి వెంకట సుబ్బారావు	స్వతంత్ర
10.ఆదినారాయణ దుప్పనపూడి	స్వతంత్ర
11.ఆనంద్ చందులాల్ జాస్తి	స్వతంత్ర
12.ఉందుర్తి ప్రసన్న కుమార్	స్వతంత్ర
13. కేత శ్రీను	స్వతంత్ర
14.గేదెల లక్ష్మణరావు	స్వతంత్ర
15.గొట్టుముక్కల శివాజీ	స్వతంత్ర
16.నల్లి రాజేష్	స్వతంత్ర
17.బలగం నాయకర్	స్వతంత్ర
18.మేడపాటి వరహాల రెడ్డి	స్వతంత్ర
19.రామ దుర్గాప్రసాద్ తోలేటి	స్వతంత్ర
20.రుక్మిణి	స్వతంత్ర
21.శేఖర్‌బాబు అద్దంకి	స్వతంత్ర

ఎవరి బలమెంత?






■ కూటమి ఉమ్మడి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తొలినుంచీ భార తీయ జనతాపార్టీలో ఉన్నారు. సుదీర్ఘకాలం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఇప్పుడు కూటమి అభ్యర్థులు, నాయకులు, పార్టీ శ్రేణులు పూర్తి సహకారమందిస్తున్నాయి. ఇప్పటికే చంద్ర బాబు, పవన్ కల్యాన్‌లు జిల్లాలో రెండు పర్యాయాలు పర్యటించారు, శ్రీనివాస్ వర్మను నెగ్గించాలని కోరారు. ఇది కూడా వర్మపై ప్రజల్లో సాను కూలత పెంచింది. మరో వైపు ఈనెల 11న అమిత్ షా భీమవరం రానున్నారు. రోడ్‌షో నిర్వహిస్తారు. అదికూడా శ్రీనివాస్ వర్మపై గెలపుకు దోపదపడనుంది. ఎన్నికల వ్యయంలోనూ పార్టీ సహకారమందించింది. నర్సాపురంలో గెలిచి తీరాలన్న తలంపుతో బీజేపీ నాయకత్వం ఉంది.

■ వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమాబాలకు వైసీపీ అధిష్ఠానం ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. టిక్కెట్ దక్కించుకోవడంలోనూ అధిష్ఠానం మద్దతు వల్లే సాధ్యపడింది. జిల్లా నాయకులతో పెద్దగా సఖ్యత లేకపోయినా అధిష్ఠానం ఆదేశాలతో వైసీపీ అభ్యర్థులంతా ఇప్పుడు ఉమాబాల కోసం పనిచేస్తున్నారు. మరోవైపు సామాజిక వర్గ కార్డును తెరపైకి తెస్తున్నారు. శెట్టి బలిజ సామాజిక వర్గమంటూ ఆత్మీయ సమావేశాల్లో చెప్పుకొస్తున్నారు. ఆ వర్గం ఇప్పుడు మద్దతు ఇస్తుందని పార్టీ విశ్వసిస్తోంది. రెండుసార్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జిల్లాలో పర్యటించారు. సభల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా ఉమా బాలను పరిచయం చేశారు. అయితే పార్టీపైనా, ప్రభుత్వంపైనా ఉన్న వ్యతిరేకత ఇప్పుడు ఉమాబాలనూ వెంటాడుతోంది,

మేనిఫెస్టో వార్ !



వీటిచుట్టూనే అన్నిపార్టీల ప్రచారం

కూటమి హామీలవైపు కదులుతున్న జనం

వైసీపీకి ఇదే అన్నిచోట్ల భారీ షాక్

ఆసక్తి కనబరుస్తున్న సామాన్య జనం

నేతల ప్రసంగాలు అన్ని దీని చుట్టూనే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ప్రజల మదిలో హత్తుకుపోయేలా పదిమంది అనుకూలత సాధించేలా ఎన్నికల వేళ మేనిఫెస్టోలు రూపు దిద్దుకుంటాయి. ఏది చెడ్డో, ఏది మంచో ఇంతకు ముందు పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈసారి ఇటు కూటమి మేనిఫెస్టో, అటు వైసీపీ మేనిఫెస్టో ప్రజల నోట నానుతున్నాయి. ఈ రెండింటిని బేరీజు వేసుకునే క్రమంలోనే ఓట్ల పండుగ వైపు సాగుతున్నారు. హామీలు రెండింటిని పరిశీలించిన దరిమిలా కూటమివైపే మొగ్గు చూపు తున్నట్టు కనిపిస్తోంది.గడిచిన ఐదేళ్లల్లో కొన్ని పథకాలు అమలు కాగా మరెన్నో పథకాలు మాయం అయ్యాయి. కొన్నివర్గాలకు మాత్రమే ప్రభుత్వ పరమైన సాయం అందగా ఇంకెందరికో రిక్తహస్తాలే. ఇప్పుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబు, సీఎం జగన్, జనసేన అధిపతి పవన్‌కల్యాణ్ నోట మేనిఫెస్టోల్లో ఉన్న హామీలనే తేడా చూపించి మరీ అస్త్రాలు విసురుతున్నారు. ఎన్నికలకు ముందుగానే ఆరోపణలు, విమర్శలు అన్ని ఈ మేనిఫెస్టోల చుట్టూనే తిరుగుతున్నాయి.జనం కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆక్వాకు తగ్గింపు రేట్లలో విద్యుత్, కనీస మౌలిక సదుపాయాలు, ఆర్థికపరమైన అంశాలు అన్నింటిలోనూ నేరుగానే స్పందిస్తుండడం ఈ ఎన్నికల్లో మరో విశేషం.

మహిళలకు నెలకు రూ.1500

మహిళా గ్రూపులు అన్నింటికి ఇప్పటివరకు తామే రుణాలు ఇస్తున్నట్లు, తాము చెప్తేనే బ్యాంకులు అంద జేస్తున్నట్లు వైసీపీ మహిళా గ్రూపులపై వైసీపీ పెత్తనం చేస్తూ వచ్చింది. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల సభలకు మహిళా గ్రూపులే కూలీ అవుతారమెత్తాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు తాము అధికారంలోకి వసే ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని కూటమి తన మేనిఫెస్టోలో ప్రకటించింది. గడిచిన మూడునెలల క్రితం వరకు ఉన్న అనుకూలత కంటే ఈ వరంతో రెండింతలు మేర మద్దతు పెరిగినట్టు కూటమి అంచనా వేస్తోంది. మారు మూల పల్లెల్లో కూడా ఇది దూసుకుపోయింది. మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కూడా వారిని అమితంగా ఆకట్టుకుంటున్నది.

ఆలోచనలో పడ్డ వలంటీర్లు

ఇప్పటివరకు వైసీపీ వలంటీర్లను తమ కార్యకర్తలుగానే ప్రకటిస్తూ ప్రభుత్వ పరంగా మాత్రం వారి సేవలను క్షేత్రస్థాయికి చేర్చింది. వలంటీర్ల వ్యవస్థకు కూటమి వ్యతిరేకమంటూ ప్రచారం సాగగా, కూటమి మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లకు నెలకు రూ.10 వేల గౌరవవేతనం ఇస్తామని, పింఛన్‌తో సహా మిగతావన్నీ పేదల ఇళ్ళకే వీరి ద్వారానే చేరతాయంటూ ప్రకటించింది. అప్పటివరకు వలంటీర్లు వైసీపీ బెదిరింపులకు కాస్తంత తలొగ్గి వారి డైరెక్షన్‌లోనే వెళ్ళేవారు. కాని పదిహేను రోజులుగా జిల్లాలోని వేలాదిమంది వలంటీర్లు సైలెంట్ అయ్యారు. రాజీనామా చేయకుండా నిలబడ్డారు.

ఆరోగ్య బీమా కీలకం

కూటమి విడుదల చేసినా మేనిఫెస్టోలో నిరుద్యోగుల దగ్గర నుంచి రూ.25 లక్షల ఆరోగ్య బీమా వరకు కొందరిని కదిలిస్తున్నాయి. గోదావరి జిల్లాలతో సహా అన్ని ప్రాంతాల్లోనూ రూ.25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఇప్పుడు అన్ని వర్గాలను ఆలోచింప చేస్తోంది. వైసీపీ హయాంలో ఆరోగ్యశ్రీ సేవలు మందగించడం, సకాలంలో వైద్యం అందకపోవడం, కొన్నిసార్లు ఆస్పత్రులు బిల్లులు కోసం పట్టుపట్టడం వంటి ఆటంకాలు ఎన్నో కనిపిస్తూ వచ్చాయి. ఇప్పుడు హెల్త్ ఇన్సూరెన్స్ కూటమికి కలిసొచ్చేదిగా మారగా, వైసీపీకి మైనస్ పాయింట్లు పడుతున్నాయి.

పెన్షన్ నాలుగు వేలు..

అధికారంలోకి వస్తే పెన్షన్ రూ.3 వేలు చేస్తామని చెప్పిన వైసీపీ దప దఫాలుగా పెంచుకుంటూ ఐదేళ్లకు మూడు వేలు చేసింది. దీనిపై లబ్ధిదారులు పెదవి విరుస్తూను వచ్చారు. టీడీపీ మేనిఫెస్టోలో అవ్వా తాతలకు ఇచ్చే సామాజిక పెన్షన్లను రూ.4 వేలు పెంచి ఇస్తానని ప్రకటించింది. దివ్యాంగులకు ఆరువేలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి రూ.10 వేలు ఇవ్వనున్నట్టు తెలిపింది. ఇది వైసీపీకి పెద్ద షాకే ఇచ్చింది. ఇది వృద్ధుల్లో ఆనందాన్ని ఇచ్చేదిగా ఉండడంతో పాటు టీడీపీకి బాగా కలిసొచ్చే అంశమని విశ్లేషకుల అంచనా.

అభివృద్ధి..సంక్షేమం వైపే..

నవరత్నాలతోనే రాష్ట్రం రూపురేఖలు మార్చేశామంటూ వైసీపీ తన మేనిఫెస్టోలో గొప్పలు చెప్పుకుంది. కులాలవారీగా ఇచ్చే ఆర్థిక సాయాలను కాస్త పెంచింది. ఈ ఐదేళ్లల్లో సామాజిక వర్గాల ప్రాధాన్యతగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినా ఆయా కార్పొరేషన్‌ల ద్వారా సామాజికవర్గాల మద్దతును కూడకట్టడంలో వైఫల్యం చెందింది. ఇదంతా కూటమికి కొలిసొచ్చేదిగానే మారింది. కాపు సామాజిక వర్గం బలంగా ఉన్న ఏలూరు, కైకలూరు, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల్లో తీవ్ర ప్రభావితం చేస్తోంది. గౌడ, యాదవ, శెట్టిబలిజ సామాజికవర్గాల్లో పెనుమార్పులు వచ్చి పడ్డాయి. ఇప్పటివరకు సామాజికవర్గ పరంగా తమను ఎలా అణచివేశారో బహిరంగ వేదికలపై కూటమి విడమర్చి చెబుతున్నట్టుగా ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారు. దళిత వర్గాలన్ని ఒకటికి రెండు సార్లు తమంతట తాముగా చర్చించి, సంప్రదించి గత నిర్ణయాలను పునఃపరిశీలన చేయడంతో వైసీపీ వర్గాల్లోనూ కలవరం రేగుతోంది.

సీఎం సభలు పలుచనే..

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇప్పటికే సీఎం జగన్ ఏలూరులో ప్రచార సభ నిర్వహించారు. ఏలూరులో జరిగిన సీఎం సభ పేలవంగా సాగింది. ప్రత్యేకించి 2014 నాటి చంద్రబాబు మేనిఫెస్టోను ప్రస్తావిస్తూ దాంట్లో ఒక్కటి కూడా అమలు అయ్యిందా అంటూ పదేళ్ల నాటిదాన్ని ప్రస్తావించి జనం జవాబు కోరడం బోరు కొట్టించింది. తాజాగా వైసీపీ విడుదల చేసిన మేనిఫెస్టోతో జనాన్ని ఆకట్టుకోలేక పోయారు. సీఎం జగన్ ప్రసంగం సాగినంత సేపు తెలుగు దేశం, వైసీపీ మేని ఫెస్టోలను చూపిస్తూనే సాగింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గణపవరం, కైకలూరు, కొయ్యలగూడెం సభల్లోనూ తెలుగుదేశం అధినేత చంద్రబాబు దెందులూరు ప్రచార సభలోనూ మేనిఫెస్టో ప్రస్తావించినప్పుడు జనం నుంచి స్పందన దక్కింది. హర్షధ్వానాలతో మేనిఫెస్టోకి మద్దతు పలికారు.

ఎస్ఈబీ దాడులు ..13 కేసులు నమోదు



నూజివీడులో ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం

ఏలూరు క్రైం, మే 6 : ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఎస్ఈబీ బృందాలు దాడులు నిర్వహించాయి. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సారా, మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా సోమ వారం జిల్లాలోని చింతలపూడి, భీమడోలు, జంగారెడ్డి గూడెం, నూజివీడు, పోలవరం, ఏలూరు, కైకలూరు ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ అధికారులు, చెక్‌పోస్టుల సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు.సారా తయారీ, విక్రయ దారులపై 2 కేసులు నమోదులు చేసి వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 1500 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. డ్యూటీ పెయిడ్ లిక్కర్ కల్గి ఉన్నవారిపై 9 కేసులు నమోదు చేసి 58.17 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ కింద ఒక కేసు నమోదు చేసి 103.2 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.13 కేసులలో 11 మంది వ్యక్తులను అరెస్టు చేశారు.మిగిలిన వారిని అరెస్టు చేయాల్సి ఉంది. ఆరు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి 14 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కూటమితోనే మంచిరోజులు

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



తాడిపూడిలో ఎన్నికల ప్రచారంలో ముప్పిడి వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, మే 6: కూటమితోనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ మారుతుందని, టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.సోమవారం తాళ్లపూడి మండలంలోని తాడిపూడిలో జనసేన మండ లాధ్యక్షుడు గంటా శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకా లను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దెందులూరి రాజేష్, ఈతా భాస్కర్, వెలుగుల వాసు, మహేష్, ఈతారాజు తదితరులు జనసేన పార్టీలో చేరారు. వారికి ముప్పిడి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు ఆధ్వర్యంలో నాగిశెట్టి లక్ష్మీ నారాయణ, బండారు సత్తిబాబు, శ్రీను, మొదలవలస రవి, పులవర్తి శేఖర్, గురుగుబెల్లి హరి తదితరులు టీడీపీలో చేరారు. అల్లూరి విక్రమాదిత్య, నామా నరేంద్ర, చెన్నా సత్యనారాయణ, తిరుమలశెట్టి కృష్ణ, తిరుమలశెట్టి రామ్మూర్తి, కాకర్ల సత్యేంద్ర, నామన బూరయ్య, అయితం మణికంఠ, ఉప్పులూరి చిరంజీవి, కొప్పాక విజయ్‌కుమార్, దేవన సత్య నారాయణ, చలపాటి ప్రకాష్, కొప్పాక కోటేశ్వర్, భీమ రాజు, జక్కుల శ్రీను, దుగ్గిరాల శ్రీనివాస్, గన్నిన సత్తిబాబు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ముప్పిడి

ఆర్థిక, సామాజిక అభివృద్ధే లక్ష్యం



నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో

టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, మే 6: నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలన్నదే నా లక్ష్యం. ప్రజల సంక్షేమమే నా ధ్యేయం. ఇందు కోసం ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక మేనిఫెస్టో రుపొందించా. అధికారంలోకి వచ్చాక పక్కాగా అమలు చేస్తానని ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు.

• **తణుకు మాస్టర్ ప్లాన్:** టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలోని రోడ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తా. కొత్త రహదారుల నిర్మాణంతో పాటు మరమ్మతులు అవసరమైన వాటిని బాగు చేయిస్తాం. తణుకు పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు చేసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమున్న చోట్ల రోడ్లు విస్తరణ చేస్తా. కొత్త రోడ్లు నిర్మించి పట్టణ పరిధి పెంచడానికి కృషి చేస్తా.

• **క్రీడా సౌకర్యాలు:** అన్ని గ్రామాల్లోను యువతకు సకల సదుపాయాలతో కూడిన క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తా. క్రీడల్లో ప్రోత్సహించి దేశవాళీ టోర్నీలకు సంసిద్ధం చేస్తా.

• **డ్రెయినేజీ వ్యవస్థ:** అన్ని గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించి సక్రమంగా నిర్వహణ చేసే విధంగా చర్యలు తీసుకుంటా. ప్రధాన కాలువల్లో చెత్త పేరుకు పోకుండా చర్యలు తీసుకుంటా. అవసరమైన చోట అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణానికి పెద్దపీట వేస్తా.

• **పారిశుధ్యం:** చెత్త పన్ను రద్దు చేస్తా. అస్తవస్తంగా ఉన్న పారిశుధ్య వ్యవస్థను సరిచేస్తా. ప్రతి వీధిలో స్పెషల్ డ్రైవ్ పెట్టి మురుగు కాల్వలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటా. డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయిస్తా.

• **సొంతింటి నిర్మాణం:** పట్టణంలోని టిడ్కో ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తా. నియోజకవర్గంలో ఇళ్ళు లేని నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా పక్కా ఇళ్ళు మంజూరు చేయిస్తా.

• **విద్య, మెడికల్, ఐటీ హబ్‌లు ఏర్పాటు:** ఎడ్యుకేషనల్, ఐటీ, మెడికల్ హబ్‌ల స్థాపనకు కృషి చేస్తా. తణుకు నియోజకవర్గంలో ఆటోనగర్ నిర్మాణంతో పాటు ఇండస్ట్రియల్ పార్కుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి, స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తా.

• **కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం:** కొత్త కమ్యూనిటీ హాళ్ళు నిర్మించడంతో పాటు అవసరమైన చోట్ల ఉన్న వాటిని విస్తరణ చేయిస్తా.

• **జిల్లా ఆసుపత్రి ఆధునీకీకరణ:** టీడీపీ హయాంలో మంజూరైన జిల్లా ఆసుపత్రికి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అన్ని విభాగాల్లో వైద్యులను నియమిస్తా.

• **యువతకు ఉపాధి:** నిరుద్యోగులైన యువత కోసం ప్రభుత్వ నోటిఫికేషన్లతో పాటు ప్రైవేటు ఉద్యోగాలకు జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తా. యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణ ఇప్పిస్తా

• **గ్రామ దర్శిని:** గ్రామాలు, వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడి ప్రజా సమస్యలు పరిష్కరిస్తా. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చి, హరిత గ్రామాలుగా రూపొందిస్తా.

• **మహిళా సాధికారత:** మహిళలకు పెద్దన్నగా ఉంటూ వారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తా. వారికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి అన్ని కులాలు, మతాల్లోని మహిళలకు ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగం, వ్యాపారం వైపు నడిపిస్తా. డ్వాక్రా సంఘాల ద్వారా వచ్చిన ఉత్పత్తులకు మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తా.

• **ఇంటి వద్దకే పింఛన్, రేషన్:** ప్రతి ఇంటికి పింఛన్, రేషన్ సరుకులు సక్రమంగా అందించడంతో పాటు, ప్రతి నెలా క్రమం తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటా.

• **చిరు వ్యాపారులకు అండ:** వీధి, చిరు వ్యాపారులు ఎలాంటి అడ్డంకులు లేకుండా వ్యాపారం చేసుకునేలా శాంతియుత వాతావరణం కల్పిస్తా. వీధి, తోపుడు బండి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వారిపై దాడులు, అధికార ఒత్తిళ్ళు అరికడతా. ప్రత్యేకంగా ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేస్తా.

• **రైతన్నకు తోడుగా:** రైతన్నలకు సమయానికి సాగునీరందించి, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఆదుకునే వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తా. పంటను మద్దతు ధరకు అమ్ముకునేలా ఐకేపీ కేంద్రాలు పునః ప్రారంభిస్తా. ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ప్రారంభిస్తా. విత్తనాలు, మందులు, ఎరువులు, టార్పాలిన్లు, యాంత్ర పరికరాలు రాయితీ ధరలకు అందేలా కృషి చేస్తాను. ఆక్వా జోన్ ఏర్పాటుకు కృషి చేస్తా.

• **అరాచకాలకు అడ్డకట్ట:** సుపరిపాలన అందించే విధంగా చర్యలు తీసుకుంటాను. యువతను పెడదోవ పట్టిస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాలను తణుకు నుంచి తరిమికొట్టి అసాంఘిక కార్యకలాపాలను అణచివేస్తాను. మహిళలపై దాడులు, దొంగతనాలు అరికట్టేందుకు ప్రతి వీధిలో సీసీ కెమెరాలు అమర్చి 24 గంటలు పర్యవేక్షిస్తా. ప్రశాంత వాతావరణాన్ని తణుకు ప్రజలకు చేరువ చేస్తా

జగన్‌ను సాగనంపేందుకు సిద్ధం: నిమ్మల



టీడీపీ అభ్యర్థి నిమ్మలకు హారతి ఇస్తున్న మహిళలు

పాలకొల్లు రూరల్, మే 6 : రాష్ట్రం నుంచి సీఎం జగన్‌ను తరిమి కొట్టేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం చందపర్రు, ఆగర్తిపాలెం, తిల్లపూడి, వెంకటాపురం, అరట్ల కట్ట గ్రామాల్లో సైకిల్‌పై వెళ్ళి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నిమ్మల మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు మీ సేవకునిగా పనిచేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలు, ఇతర సామాన్య, మధ్య తరగతి ప్రజలు జగన్‌ను ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని, గత టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని సరిచూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి రాబోయే కూటమి ప్రభుత్వంలో రైతు స్వేచ్ఛగా ధాన్యం అమ్ముకునే పరిస్థితిని తీసుకువస్తామన్నారు. రామానాయుడు వెంట నాయకులు రాపాక విజయరత్నం, పరువు యేసుదయ, కర్రే ఇశ్రాయేలు, దేవ బత్తుల వెంకటేశ్వరరావు, కె రమేష్, పుచ్చకాయల పెద్దిరాజు, జి బాబు, ఎ జాన్, పి సుజాత, ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలిస్తేనే.. రాజధానిగా అమరావతి



ప్రచారం చేస్తున్న రామరాజు, కొవ్వలి నాయుడు

నరసాపురం, మే 6: గాడితప్పిన రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి వైపు పరుగులు పెట్టించాలంటే కూటమి అధికారంలోకి రావాలని జనసేన అభ్యర్థి నాయకర్ అన్నారు. సోమవారం రాజుగారితోట, మొగల్తూరు మండలంలో కొత్తోట, కాళీపట్నం గ్రామాల్లో మాజీ మంత్రి కొత్తపల్లి, మాజీ ఎమ్మెల్యే బండారు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి, టీడీపీ రాష్ట్ర నాయకులు కొవ్వలి నాయుడు, బీజేపీ నాయకులు మేకల సతీష్, వీవీఆర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక వలస బాట పట్టారన్నారు. అభివృద్ధి లేకపోవడంతో భూముల విలువ పడిపోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రం గాడిలో పడాలంటే అనుభవజ్ఞులైన చంద్రబాబు లాంటి నాయకుడును సీఎం చేయాలన్నారు.

రైతు పక్షాన నిలబడే పార్టీలను గెలిపించాలి

నరసాపురం టౌన్, మే 6: రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజల సంక్షేమం, అభివృద్ధి చేసే పార్టీలకే రానున్న ఎన్నికల్లో గెలిపించాలని రాజ్యాంగ పరిరక్షణ హక్కుల వేదిక పిలుపునిచ్చింది. సోమవారం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన సదస్సుకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేసి సమగ్ర వ్యవసాయ చట్టాన్ని తీసుకురావాలని 60సంఘాలతో పోరాటం చేస్తున్నామన్నారు. రైతు పక్షాన నిలబడే పార్టీలను గెలిపించాలన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తే దేశంలో వ్యవసాయం గిట్టుబాటుగా మారుతుందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కేబీఆర్ నాయుడు, సీపీఎం నాయకులు బలరాం, కె.పెద్ది రాజు, రాము, సీపీఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు, మనోరామ పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో దంతులూరి జయంతి

భీమవరం ఎడ్యుకేషన్, మే 6 : డీఎన్నార్ కళాశాలలో దంతులూరి నారాయణ రాజు 127వ జయంతి పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ఉన్న దంతులూరి నారాయణరాజు, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు కళాశాల అధ్యక్షకార్యదర్శులు గోకరాజు నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ రాజు ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు సైతం అతి తక్కువ ఫీజుతో విద్యా అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.

ఆలోచించి ఓటు వేయండి...



నరసాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న దాసరి రాము

నరసాపురం/భీమవరం టౌన్, మే 6: రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది, ఉపాధి లేక యువత పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నారు, దేశంలో ఎక్కడ లభించని మద్యం ఆంధ్రాలో అమ్ముతున్నారు, ఈపరిస్థితి పోవాలంటే రానున్న ఎన్నికల్లో ఆలోచించి సమర్థవంతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సౌత్ ఇండియా కాపు, బలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ దాసరి రాము విజ్ఞప్తి చేశారు. సోమవారం జనసేన కార్యక్రమంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా... పథకాలు అమల్లో ఉంటాయి, అయితే అప్పులు తెచ్చి పథకాలు ఇస్తూ పోతే ప్రజలపై ఆ భారం పడుతుందన్నారు. డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, చాగంటి చిన్న, కోటిపల్లి వెంకటేశ్వరావు, వర్ధనపు ప్రసాద్, మద్రాజు, నళినిలు పాల్గొన్నారు. భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో అప్పుల్లోకి కూరుకుపోయిందని, ఒక్కరోజు గడవాలన్నా అప్పు చేయాల్సిన పరిస్థితి జగన్ ప్రభుత్వం తీసుకుని వచ్చిందని అన్నారు. భీమవరం ఎమ్మెల్యేగా అంజిబాబును, ఎంపీగా భూపతిరాజు శ్రీనివాస్ వర్మను గెలిపించుకోవాలని కోరారు.

10 నుంచి వేసవి శిక్షణ తరగతులు

భీమవరం టౌన్, మే 6 : ఈనెల10వ తేదీ నుంచి వచ్చేనెల 9 వరకు పీఎస్ఎం హైస్కూల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు భాష, చదరంగం, చిత్రలేఖనం తదితర వాటిపై విద్యార్థులకు ఉదయం 8-30 గంటల నుంచి .11-30గంటల వరకు ఉచితంగా శిక్షణ అందిస్తామని తెలిపారు.

ఉద్యోగులందరూ ఓటు వేసేందుకు అవకాశం

పెనుమంట్ర, మే 6: ప్రభుత్వ ఉద్యోగులందరూ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విజ్ఞప్తి మేరకు సోమవారం ఏపీ ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాలు ఇచ్చారని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తెలిపారు. ఫారం-12 అప్లై చేసిన కింద స్థాయి ఉగ్యోగులు ఓటు హక్కు వినియోగించేందుకు ఇబ్బంది పడుతున్నారని, అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తాము కోరామన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లిన వారికి అక్కడే ఫారం-12 పూర్తి చేసిన వారికి కూడా ఓటు హక్కుకు కాశం కల్పించాలని కోరగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సానుకూలంగా స్పందించారన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తణుకు, మే 6: తణుకు పట్టణ పరిధిలోని గోస్తనీ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని పోలీసులు గుర్తించారు. సజ్జాపురం శివాలయం పరిధిలోని వంతెన సమీపంలో మృతదేహం ఉన్నట్టు స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి 45-50 ఏళ్ల మధ్య వయసుంటుందని, శరీరంపై దుస్తులు లేవని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబరు 91549 65934కు తెలియజేయాలని చెప్పారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



మొగల్తూరు,మే6: స్థానిక దయాల్‌దాస్ పేటలో వేంచేసి ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గత ఆరు రోజులుగా స్వామి వారి వార్షిక కళ్యాణోత్సవాలు నిర్వహించిన పండితులు ఆఖరి రోజు సోమవారం స్వామి వారికి చక్ర స్నానం, అనంతరం వసంతోత్సవాన్ని ఘనంగా జరిపారు. రాత్రి పుష్పయాగం, అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

మొగల్తూరులో పోలీసుల కవాతు

మొగల్తూరు,మే6: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ కె.వెంకట రమణ అన్నారు. మొగల్తూరు గ్రామంలోని కుక్కలవారితోట, మసీదు సెంటర్, గాంధీబొమ్మల సెంటర్ తదితర ప్రాంతాల్లో సోమవారం కేంద్ర బలగాలతో కలిసి పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు.

'ఆసరా' నగదు కోసం మహిళల ఆందోళన



మొగల్తూరు,మే6: నాలుగో విడత ఆసరా రుణ మాఫీ నగదు రాలేదంటూ పేరుపాలెం పంచాయతీ దిబ్బల పల్లవపాలెం డ్వాక్రా మహిళలు సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 2న ముఖ్యమంత్రి ఆసరా నగదు విడుదల చేస్తున్నట్టు బటన్ నొక్కారన్నారు. అయినప్పటికి తమ గ్రూప్ పొదుపు ఖాతాల్లో జమ కాలేదన్నారు. తక్షణమే నగదు జమయ్యే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్, మే 6: తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెంలో సోమవారం రాత్రి మట్టి లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలైనట్టు పోలీసులు తెలిపారు. వీరంపాలెం వైసీపీ నాయకుడికి చెందిన లారీ అక్రమంగా మట్టి తరలిస్తుండగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న అశోక్ అనే యువకుడిని ఢీకొంది. దీంతో అశోక్ కాలు నుజ్జయింది. వెంటనే అతనిని తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం





మార్టేరులో పితాని కోడలు నాగ సాహితి ప్రచారం... వడలిలో పితానిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెనుమంట్ర, మే 6: తెలుగుదేశం జనసేన కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ కోడలు నాగ సాహితి అన్నారు, సోమవారం పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఆచంట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ విజయాన్ని చేకూర్చాలని, నరసాపురం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పితాని సాహితీ, బలుసు మాధవిలత ఇంటింటా ప్రచారం నిర్వహించారు సూపర్ సిక్స్‌పథకాలను వివరించారు. టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రజారంజిక పథకాలను పొందుపరిచారని కూటమి అధికారంలోకి రాగానే ప్రజలందరికీ మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, కోణాల శ్రీనివా సరెడ్డి, వెలగల బ్రదర్స్, నల్లిమిల్లి వివేకానంద రెడ్డి, మాజీ జడ్పీటీసీ సత్తి సాయి ఆది నా రాయణ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు తమానంపూడి శ్రీరామ దుర్గారెడ్డి, తేతలి రాజారెడ్డి, షేక్ అలీ, కారేపల్లె భాస్కరరావు పాల్గొ న్నారు.

అమ్మవారికి పితాని పూజలు

పెనుగొండ, మే 6: వడలి గ్రామంలో గ్రామదేవత మందాలమ్మ జాతర కార్యక్రమంలో భాగంగా ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

సంక్షేమం, అభివృద్ధి మా అజెండా: అంజిబాబు



వైసీపీ నాయకులను జనసేనలోకి ఆహ్వానిస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు

భీమవరం రూరల్, మే 6 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి సంక్షేమంతో కూడిన అభివృద్ధి చేస్తుంది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో భీమవరం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధికి ఇప్పటికి ప్రజలు మరిచిపోలేదు. రహదారులు అభివృద్ధి, గ్రామాలలో మౌలిక వసతులకు తెలుగుదేశం పెద్ద పీట వేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నీరుగారిపోయాయి. అభివృద్ధి లేకుండా పోయింది అన్నిరంగాలు దెబ్బతిన్నాయి. ప్రజలు ఆదాయం ఉపాధి మార్గాలు తగ్గిపోయాయి. వైసీపీ హయాంలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితి గట్టెక్కాలంటే కూటమిని గెలిపించాలని జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) విజ్ఞప్తి చేశారు. భీమవరం మండలం గూట్లపాడు తోకతిప్ప, దొంగపిండి, లోసరి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. భారీ ర్యాలీగా సాగారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఈసందర్భంగా హామీ ఇచ్చారు. బోట్‌లు, వలలు పంపిణీ చేస్తాం. ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తాం. మత్స్యకారులకు ప్రతిబంధకంగా మారిన 217 జీవోను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల నుంచి భీమవరం చేరుకోవడానికి తన హయాంలోనే కోట్ల రూపాయలతో డబుల్ రోడ్లు వేశాం. శివారు ప్రాంతాలకు సాగు నీరు, తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకున్నానని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళలో కాలువలను భ్రష్టు పట్టించడంతో దిగువ గ్రామాలకు తాగు నీటి సమస్యగా మారిందని దానిని తాను పరిష్కరిస్తానని అన్నారు.

జనసేన, టీడీపీలో చేరిక

భీమవరం రూరల్, మే 6 : భీమవరం మండలంలోని వైసీపీకి చెందిన సర్పంచ్‌లు జనసేన, టీడీపీ కండువా కప్పుకున్నారు. దెయ్యాలతిప్ప సర్పంచ్ తిరుమాని శ్రీను బృందం 50మందితో కలిసి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, నాగిడి తాతాజీ, భీమాల శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. అదేవిధంగా లోసరి సర్పంచ్ శివాజీ 50 మందితో జనసేనలోకి చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు: వర్మ



నరసాపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శ్రీనివాసవర్మకు మద్దతు తెలుపుతున్న కాపు సంఘ నాయకులు, మహిళలు

పెనుగొండ, మే 6: 'కులం లేదు.. మతం లేదు.. అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తాం...రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం... పశ్చిమ గోదావరి జిల్లాను మరింత సుసంపన్నం చేస్తాం.. ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తాం... నరసాపురం లోక్ సభలో అత్యధిక మెజార్టీతో గెలుపు తథ్యం. ఎక్కడకు వెళ్ళినా ప్రజలు ఆదరాభిమానాలు చూపుతున్నారు. ఆశీర్వదిస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని జనం కోరుకుంటున్నారు. వైసీపీ కాంగ్రెస్ పాలనతో అవినీతి తప్ప అభివృద్ధి లేదు.' అని నరసాపురం లోక్ సభ కూటమి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస వర్మ అన్నారు. పెనుగొండలో కాపుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆచంట టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ సమ్మేళనంలో పాల్గొన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్ర పరిస్థితి కోసమే టీడీపీ,జనసేన, బీజేపీలు కలిశాయి. రాష్ట్రంలో ప్రాజెక్టులు అన్ని పూర్తి కావాలంటే, పోలవరంతో సహా మంచినీరు అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కేంద్రం సహకారం అవసరం. కేంద్రం నుంచి నిధులు తెప్పించే బాధ్యత మాది. జిల్లాలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తాం.. అభివృద్ధి చేసి చూపిస్తాం. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. మహిళలకు స్వయం ఉపాధి చూపిస్తాం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఉంటుందన్నారు. సమావేశంలో పాల్గొన్న వారంతా పితాని, శ్రీనివాస వర్మకుఓటు వేస్తామని ప్రకటించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ముఖ్యఅతిథిలుగా విచ్చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని, బీజేపీ పరిశీకులు రావూరి సుధ, కంబాల బాబులు, బడేటి బ్రహ్మాజీ, వరికూటి సాయి కిషోర్, దార్లంక మారుతి, బోడపాటి దుర్గా ప్రసాద్, తోట తాతాజీ, మైగాపుల రాము, ఎల్ వర్మ, బొబ్బిలి శ్రీను, పి. నాగశ్రీను, బండారు కృష్ణంనాయుడు, పప్పొప్పుల బుజ్జి, తోలేటి వేణు, తోరం వెంకన్నబాబు, అడబాల శ్రీనివాసు, ఏడిద శ్రీను,మండేల శ్రీను, ముఖమట్ల కృష్ణకాంత్, పాల్గొన్నారు.

అవినీతి అనకొండలను తరిమికొడదాం..



ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మే 6: రాష్ట్రంలో అవినీతి అనకొండలను తరిమి కొట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి కోరారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని 10, 12 వార్డుల్లో కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టులన్నీ మరుగున పడిపోయాయి. వైసీపీకి మళ్లీ అధికారం ఇస్తే మరింత దోచుకోవాలని అధికార పార్టీ నేతలు ప్రణాళికలు వేసుకున్నారు. తాడేపల్లిగూడెంను అభివృద్ధి పథంలో నడిపించాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి. పవన్ చిత్తశుద్ధి అవసరం. అందుకోసం తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నుంచి పోటీచేస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం. నీతివంతమైన పాలనకు మేమంతా కట్టుబడి ఉన్నాం. కూటమి విజయం తథ్యం.

తాడేపల్లిగూడెం మండలానికి తాడిపూడి ఎత్తిపోతలతో గోదావరి నీరు అందిస్తాం. గోదావరి జలాలను పైపులైన్‌ల ద్వారా అందించి మండలంలోని అన్ని గ్రామాలకు సురక్షిత గోదావరి మంచినీరు అందించేందుకు కృషి చేస్తాం. తాడేపల్లిగూడెం పట్టణాన్ని వాణిజ్య, విద్యా హబ్‌లుగా తీర్చిదిద్దుతాం. ప్రతి చోటా కూటమి పాలనను కోరుకుంటున్నారు. పట్టణంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ఏర్పాటు, భూగర్భ డ్రెయినేజి నిర్మాణం, నిట్ కళాశాల అభివృద్ధి, జూనియర్ కళాశాల భవన నిర్మాణంతోపాటు విమానాశ్రయ భూముల్లో ఇళ్ల పట్టాలు అందిస్తాం. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజలు కూటమికే ఓటేస్తామంటూ స్పష్టం చేస్తున్నారు. ఇటు రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కారు తెచ్చుకునేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌కు గాజు గ్లాసు గుర్తుకు, ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస వర్మకు కమలం గుర్తుకు ఓటు వేయాలని వలవల కోరారు.

తాడేపల్లిగూడెం అర్బన్: దళిత ద్రోహి సీఎం జగన్‌ను ఓడించాలని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు పిలుపు నిచ్చారు. సోమవారం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలసి మద్దతు ప్రకటించి కరపత్రాలను ఆయన విడుదల చేశారు.

నా విజయం నల్లేరు మీద నడకే: కనుమూరి



పాందువ్వలో టీడీపీ కూటమి అభ్యర్థి రఘురామ కృష్ణరాజును సన్మానిస్తున్న గ్రామస్థులు

పాలకోడేరు, మే 6: ఉండి నియోజకవర్గంలో తెలుగుదేశం గ్రాఫ్ రోజురోజుకి పెరుగుతూ వస్తుందని ఇక నా విజయం నల్లేరు మీద నడకేనని ఉండి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. రఘురామకృష్ణరాజు సమక్షంలో మొగళ్ళు గ్రామ వైసీపీ నాయకుడు కలిదిండి వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో కలిదిండి సందీప్‌వర్మ, భరత్‌వర్మ, రామగాని దుర్గా ప్రసాద్, వేగేశ్న రాజేష్‌వర్మ, పెనుమత్స సుబ్బరాజు, బీవీఎస్ఎన్ రాజు, మరోసాఫ్ట్‌వేర్ ఉద్యోగి పెనుమత్స సుబ్బరాజు, తదితర వైసీపీకి చెందిన కార్యకర్తలు పెద్దఎత్తున టీడీపీలో చేరారు. రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఏ గ్రామంలోకి వెళ్ళిన వైసీపీ ప్రభుత్వం అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాల పై ప్రజలు విసుగుచెందారని అందుకే టీడీపీలోకి భారీగా చేరుతున్నారని అన్నారు.

ఉండి:తెలుగుదేశం కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఉండి నియోజకవర్గ తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. సోమవారం పాందువ్వ, పాందువ్వ ఖండ్రిక, రాయనివానిగుడెం, ఉణుదుర్రులలో ఎన్నికల ప్రచారం చేశారు. జగన్మోహ న్‌రెడ్డి అరాచకపాలనను అంతమొందించడానికి కూటమిగా ఏర్పడటం జరిగిందన్నారు. ఉండి నియోజకవర్గంలో సమస్యలను తాను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానన్నారు. రఘురామకృష్ణరాజు అత్తగారి ఊరైన ఉణుదుర్రు గ్రామంలో విశేష ఆదరణ లభించింది. రఘురామను చూడటానికి ప్రజలు ఎగబడ్డారు. మహిళలు వీధులలో హారతులతో రఘురామరాజును ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జు జుత్తుగ నాగరాజు, మంతెన సూర్యనారాయణరాజు పాల్గొన్నారు. రఘురామకృష్ణరాజు సమక్షంలో గ్రామంలో పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు.





వరిఘేడులో రోడ్‌షో నిర్వహిస్తున్న తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి.. రేలంగిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న కృష్ణతులసి

టీడీపీ కూటమి గెలుపు ఖాయం: ఆరిమిల్లి

తణుకు, మే 6: కూటమి ఎన్నికల ప్రచారం, రోడ్ షోలకు వస్తున్న స్పందన చూస్తుంటే ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయమైందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అత్తిలి, తణుకు మండలాల పరిధిలోని ఎర్రనీలిగుంట, వరిఘేడు, దువ్వ గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని అన్నారు. అత్తిలి, తణుకు మండలాల్లో ఆరిమిల్లి రోడ్లు, డ్రెన్‌లు అభివృద్ధి చేశారని స్థానికులు గుర్తుచేసుకుంటున్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసిగి పోయారని వివరించారు. రోడ్ షోలో ఆయా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తణుకు: తణుకు గడ్డపై రాధాకృష్ణ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. ఆరిమిల్లి విజయం కోరుతూ ఆమె ఇరగవరం మండలం రేలంగి గ్రామం, పరిసర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. విధ్వంస పాలన నుంచి పునర్నిర్మించాలంటే చంద్రబాబు, పవన్, మోది మర్గదర్శకత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీలో ఎంతో మంది ప్రొఫెషనల్స్‌కు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కలిదిండి పద్మావతి, నందూరి రామానుజం, కౌరు వెంకటేశ్వర్లు, మంత్రిరావు బాబు పాల్గొన్నారు.